

# మాటా మంతీ

## - సాయి పద్మ



*12*

# అసహనాల సహనాలు .vs. సహనాల అసహనాలు

వినటానికి ఇదేదో పజిల్ లా అనిపిస్తుంది గానీ, అన్నిటిలో జరుగుతున్న చర్చ , సోషల్ మీడియా , ఇతర మీడియాలు కోడై కూస్తున్న చర్చ ఇదే . భలే విచిత్రం అనిపిస్తుంది ఆలోచిస్తే .. ఎవర్ని అయిన కరెక్ట్ , రాంగ్ చెప్పటానికి మనం ఎవరం ?

వొక మతానికి, కులానికి, వర్గానికి , చెందినంత మాత్రాన .. మన భావాలు కరెక్ట్ , మిగతావారందరూ కాదు అంటే ఎలా ? ఈ మధ్య ప్రాచుర్యం పొందిన పదాల్లో , సహనం , అసహనం అనేవి గొప్పవి. ఆమీర్ ఖాన్ ఏదో అన్నాడని వొక గ్రూప్, హిందూ మతానికి, మన సహనానికి అది చెంపదెబ్బ అని కొంతమంది, అంత ఇబ్బందయితే , పాకిస్తాన్ పారిపో అని మరికొంతమంది అసహనాలు..!

నిజంగా, వొక ఫేం ఉన్న వ్యక్తి వొక మాట మాట్లాడితే వోవర్ రియాక్ట్ అయ్యే మనం .. గ్రామాల్లో ఎదురవుతున్న కుల , మత అసహనాలని ఏం చేస్తున్నాం ? అంతెందుకు , మనతో సమానంగా మన పనమ్మాయి లేదా అబ్బాయి కూర్చొనే లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్ ని మనం ఇస్తున్నామా ? ఇలాంటివి ఎవరూ అడగరు.. సందేహం వస్తే ఆన్సర్ కూడా దొరకదు.

గౌరవనీయంగా భావజాలానికి అంగీకారమో, వ్యతిరేకమో ఉండదు , వెంటనే పర్సనల్ గా ఎటాక్ చేసి మాట్లాడతారు. తరాలుగా మనం ఇంత అసహనం పెంచుకొని, ఇవాళ సహనం , అసహనం అని మాట్లాడితే , భలే నవ్వొస్తుంది.

కొన్నేళ్ళ క్రితం నేను రాసుకున్న వొక నోట్ లాంటి ఆవేదన –

అక్షరాలు రానప్పుడు, దాన్నాడే దాని కూతురివి, చదువెందుకులే అన్నారు

చదువుకున్నాక, ఎవడ్నో వొకన్ని పట్టు , ఉద్యోగం వస్తుందన్నారు

ప్రతిభతో ఉద్యోగం వస్తే , నెలా నెలా డబ్బొస్తే, మొగుడు వాడే వస్తాడన్నారు

పెళ్లి చేసుకోవాలంటే, కన్యవా కాదా , కనుక్కోమన్నారు

పిల్లలు పుడితే, ఇంకా కాపరం చేస్తోందా అన్నారు

విసుగెత్తి అరిస్తే, ఇదింతే, ఎప్పటికీ మాతో కలవదన్నారు

విరక్తి వచ్చి , చస్తే , కాల్చాలా పూడ్చాలా అని కులాల వారీగా యోచించారు

అన్నీ వాళ్ళే అనేసి నాకు సహనం లేదు

జీవితం నిలబెట్టుకోలేకపోయిందన్నారు

కొంతమంది పిల్లల్లో, ముఖ్యంగా రికార్డింగ్ డాన్సర్ల పిల్లలు, HIV స్టిగ్మా కి గురి అయిన పిల్లల్లో, నేనో తెలీని ఉదాసీనత చూస్తాను. ఆరోగ్యపరంగా వాళ్ళకేమీ సమస్య లేదు. కానీ.. ఆరోగ్యం అంటే కేవలం శరీరం కాదుగా .. మానసికంగా వాళ్ళు ఎదుర్కొన్న అసహనాలు ఎన్ని ? అసలు మన ఊహకే అందవు ..!

అసమానత ఉన్నంత వరకూ, అసహనం ఉంటూనే ఉంటుంది .. ఇంత చిన్న విషయం అర్ధం కావటానికి , సమానత సాధించటానికి ఎన్ని మానసిక విప్లవాలు జరగాలో, ఎంతమంది స్వేచ్ఛ గా మాట్లాడేవాళ్ళు బలవ్వాలో ..!!

ఆలోచించండి వొక్కసారి .. మళ్ళీ కలుద్దాం మరో సారి ..!

***( కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments